

పురోహితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పురోహితులకు ఆర్థిక సాయం

గోల్నాక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన సొంత నిధుల నుంచి ప్రతి నెలనెల అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆలయాలలో పురోహితులుగా పనిచేస్తున్న 13 మందికి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. బుధవారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని క్యాంపుకార్యాలయంలో 13 మంది పురోహితులకు రూ.5 వేల చొప్పన అందజేశారు. పురోహితులకు తమ వంతు ఆర్థిక సాయం అందజేసి వారికి అండగా నిలవాలనే సాయం చేస్తున్నట్లు కాలేరు వెంకటేష్ చెప్పారు. ఈ సందర్భంగా పురోహితులు ఎమ్మెల్యే కాలేరును ఆశీర్వదించారు.

కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

బర్కత్‌పుర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్‌పై మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థపై న్యాయవాద వృత్తిపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుంపుల శ్రీకాంత్ యాదవ్, కో ఆర్డినేటర్ వెంకటేష్ ఇంద్రపల్లి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడుతూ అహంకారంతో కేసీఆర్ ఈ వాఖ్యలు చేశారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఏబి వేద ప్రకాష్, బాలసాని సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రైల్వే దొంగల అరెస్టు

● **రూ.6 లక్షల విలువైన ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం**



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, సీఐ ఎల్లప్ప

బర్కత్‌పుర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారినుంచి రూ.6 లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్ . జీఆర్‌పీ సీఐ ఎల్లప్పలు వెల్లడించారు. బుధవారం రైల్వే పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగల వివరాలను వెల్లడించారు. హరియాణ రాష్ట్రానికి చెందిన అజాద్ ఖాన్ (30). బోరబండలో నివాసం ఉంటూ బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు. మహారాష్ట్ర నాగాపూర్‌కు చెందిన పటాన్ వాసింఖాన్(33) నగరంలోని సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటూ హోటల్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరుస్నేహితులు. దొంగల ముఠాగా ఏర్పడి జల్సాల కోసం రైళ్లలో బ్యాగులను దొంగిలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకొని వారినుంచి ఏడు తులాల 4 గ్రాముల బంగారు అభరణాలు, తొమ్మిది సెల్‌ఫోన్‌లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వారు చెప్పారు. వీరిపై కాచిగూడ రైల్వే పీఎస్‌లో పలు కేసులు నమోదయ్యాయని వారు తెలిపారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ ద్వారకానాద్‌మాల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

● **టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్**

రాంనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పారిశుధ్య కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రతతోపాటు వేతనాలు పెంచాలన్నారు. కార్మికుల 5 వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకట్, సురేష్, దయాకర్, చందు, తిరుమలేష్, జీవన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ముషీరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లో బాపూజీనగర్, గంగపుత్రకాలనీలలో వెలగని వీధి దీపాలకు బుధవారం విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేశారు. కొన్ని చోట్ల కొత్త విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేశారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్ తదితరులు డివిజన్‌లో వెలగని వీధిదీపాలను గుర్తించి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు.

తల్లి, కుమార్తె అదృశ్యం



అదృశ్యమైన తల్లి, కూతురు

కవాడిగూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడిన భార్య కూతురుతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.... కవాడిగూడ ముగ్గుబస్తీలో నివాసం ఉంటున్న సీహెచ్ దేవందర్ 16 ఏళ్ల క్రితం ప్రసన్నను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమారుడు అంకిత్, కూతురు వైష్ణవి ఉన్నారు. ఈ నెల 8 న భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భార్య ప్రసన్న ఈ నెల 15న కుమార్తె వైష్ణవిని తీసుకొని ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు చుట్టు పక్క ప్రాంతాల్లో వెతికినా వారి ఆచూకీ లభించలేదు. మంగళవారం రాత్రి భర్త దేవేందర్ గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం... 35 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి యాకత్‌పురా- ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల నడుమ పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

డీడీ కాలనీలో చైన్ స్నాచింగ్

అంబర్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని డీడీ కాలనీలో బుధవారం చైన్ స్నాచింగ్ జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలో నివాసం ఉంటున్న పారిజాత(65) రిటైర్డ్ ఉద్యోగి సాయంత్రం 5.30 గంటల సమయంలో పాత లైఫ్ ఆస్పత్రి సమీపంలో తనకు తెలిసిన వారి వద్దకు వెళ్లింది. రోడ్డుపై వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును తెంపుకుని పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న సీఐ అశోక్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవి కేటాయించాలి

● **భీమ్ సైనిక్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ**

నల్లకుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో చెన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి కేటాయించాలని భీమ్‌సైనిక్ ఫౌండేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కాలకోటి సత్యనారాయణ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భీమ్ సైనిక్ ఫౌండేషన్ సంస్థ సలహదారులు ఎం.ఎ. సిద్దిఖీతో కలిసి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుటుంబం డాక్టర్. బీ.ఆర్. అంబేద్కర్ విద్యా సంస్థలు నెలకొల్పి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో భీమ్ సైనిక్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు మోహన్‌రావు, ములుగు రవీందర్, శంకర్, జమాల్‌ఖాన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

● **ఎంపీ ఆర్. కృష్ణయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షలను రద్దు చేసి రాష్ట్రాల వారీగా వికేంద్రీకరించి తిరిగి పరీక్షలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం విద్యానగర్‌లో నీట్ అభ్యర్థులతో నిరసన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని, ఈ పరీక్షల నిర్వహణలో పెద్ద స్కామ్ జరిగిందని, దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఎన్నికల ఫలితాలపై దృష్టి సారించిన సమయంలో నీట్ ఫలితాలు విడుదల చేయడంలోని అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేష్, అనంతయ్య, బలరామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీపై కేంద్ర మంత్రుల గొంతులు మూగబోయాయి

కవాడిగూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షా పేపర్‌పై రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రుల నోర్లు ఎందుకు మూగబోయాయని ఎవైడబ్ల్యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లంగి విజయ్, మాలోతు సురేష్‌బాబులు ఆరోపించారు. నీట్ పేపర్ లేకేజీ నిరసనగా ఆమ్‌ఆద్మీ పార్టీ యువజన, విద్యార్థి సంఘాల జాతీయ కమిటీ పిలుపుమేరకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు.

విచారణ జరిపించాలి

బర్కత్‌పుర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ బీసీ సంఘాల నేతలు కె.శ్రీనివాస్, సుధాకర్ ముదిరాజ్ జ్యోషి రాఘవ డిమాండ్ చేశారు. బుధవారం బర్కత్‌పురా నుంచి ర్యాలీ నిర్వహించడానికి ప్రయత్నించగా గుజ్జకృష్ణతోపాటు పలువురి బీసీ సంఘాల నేతలను కాచిగూడ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలి

● **టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం**



ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల శ్రీనివాస్, ఆదిల్ షరీఫ్

బర్కత్‌పుర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని తెలంగాణ జనసమితి వ్యవ స్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. బుధవారం టీజేసెస్ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ జీహెచ్ఎంసీ విభాగం ప్రధానకార్యదర్శి ఆదిల్‌షరీఫ్‌లు ప్రొఫెసర్ కోదండరాం కలిసి వినతిపత్రం అందజేశారు. జీహెచ్‌ఎంసీలో ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో ట్రాన్స్‌పోర్టు విభాగాన్ని రక్షించే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన హామి ఇచ్చారు. ఆకుల శ్రీనివాస్, ఆదిల్ షరీఫ్‌లు మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో 2000 మంది ట్రాన్స్‌పోర్టు కార్మికులు 25 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని వారికి ఉద్యోగ భద్రత లేదని వారు చెప్పారు.

డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్లు, మెకానిక్‌లు విద్యుత్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారని వారికి న్యాయం చేయాలని వారు కోరారు. చెత్తను తరలించే డ్రైవర్లు క్లీనర్లు, ఇతర సిబ్బందిని బదిలీలు చేస్తున్నారని వీటిని తక్షణమే నిలిపివేయాలని వారు కోరారు.

కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి ఉదయ్, ఎంనాగేష్‌రెడ్డి, జి నర్సింహ, ఎం బాలకృష్ణ , వై సాయికుమార్, సీహెచ్ సతీష్, వెంకటేష్, శ్రీశైలంగౌడ్, ప్రసాద్, బానుకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లా పూర్తి చేసిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

● **జిల్లా బీసీ అభివృద్ధి అధికారి అశన్న**

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లా పూర్తి చేసిన బీసీ విద్యార్థులు మూడేళ్లపాటు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.అశన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ అభ్యర్థులు జూలై 4 వరకు లక్డీకపూల్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, స్ఫూర్తి భవన్ 4వ అంతస్తులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వివరాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జీరాక్స్ ప్రతులు జతచేయాలని సూచించారు. అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్‌చే గుర్తింపబడిన విద్యాసంస్థ నుంచి లా కోర్సులో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించరాదని, బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలి అప్పగింత



వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన ఓ వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. చిక్కడపల్లి పీఎస్ పరిధిలోని విద్యానగర్‌లో నివసించే మీసాల మరియమ్మ(85) ఈ నెల 15న కుటుంబ సభ్యులకు తెలియకుండా ఎటో వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన ఉమెన్ ఎస్ఐ మౌనిక తప్పిపోయిన వృద్ధురాలి ఆచూకీని కనిపెట్టి బుధవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ సీతయ్య ఆధ్వర్యంలో ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఏసీ రిపేర్ కోసం ఫోన్ చేస్తే..
రూ. 2.11లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాడు

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఏసీ రిపేర్ కోసమని కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసిన వృద్ధుడిని ట్రాప్ చేసిన సైబర్ నేరగాడు అతని బ్యాంకు ఖాతా నుంచి రూ. 2.11 లక్షలు కొల్లగొట్టాడు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 62 ఏళ్ల వృద్ధుడు తన ఏసీ రిపేర్‌కు రావడంతో మరమ్మతులు చేయడానికి సామ్‌సంగ్ కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో వెతికాడు. అతనికి ఒక నంబర్ కనిపించగా దానికి ఫోన్ చేసిన బాధితుడు సమస్య చెప్పాడు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తి 'ముందుగా మీరు ఆన్‌లైన్‌లో రూ.5 పంపండి అప్పుడే మీ కంప్లైంట్ మా వద్ద రిజిస్టర్ అవుతుంది. ఆ తర్వాత టెక్నీషియన్ వచ్చి ఏసీ మరమ్మతులు చేస్తారు' అని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన బాధితుడు యూపీఐ ఐడీని ఓపెన్ చేసి అతను చెప్పిన విధంగా చేశాడు. ఆ తర్వాత మెసేజ్‌లు చూసుకుంటే అతని బ్యాంకు ఖాతాలోని డబ్బులు డెబిట్ అయినట్లు తెలిసింది. దాంతో బాధితుడు అతనికి ఫోన్ చేసి ఇదేంటని నిలదీశాడు. దీంతో 'మీ డబ్బులు తిరిగి మీ ఖాతాకు బదిలీ చేస్తాను. అందుకు మీరు మీ మొబైల్ నుంచి కాకుండా వేరే నంబర్ నుంచి ఫోన్ చేయండి' అని చెప్పాడు. ఒక లింక్ వస్తుంది దాన్ని క్లిక్ చేయండి అని చెప్పడంతో బాధితుడు వాళ్ల అమ్మగారి ఫోన్ నంబర్ చెప్పాడు. ఆ నంబర్‌కు సామ్‌సంగ్ నుంచి వచ్చినట్లు ఒక లింక్ వచ్చింది. నిజంగానే కస్టమర్ కేర్ సర్వీస్ నుంచి వచ్చినట్లు ఉందని భావించిన బాధితుడు ఆ లింక్‌ను క్లిక్ చేసి అవతలి వ్యక్తి చెప్పినట్లుగా యూపీఐ ఐడీ వివరాలతో పాటు అన్ని వివరాలు నమోదు చేశాడు. ఆ తర్వాత వారి అమ్మ ఖాతా నుంచి కూడా డబ్బులు డెబిట్ అయ్యాయి. ఇలా మొత్తం రూ.2.11 లక్షలు డెబిట్ అవడం, అవతలి వ్యక్తి కాల్ కట్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి బండి సంజయ్‌కు శుభాకాంక్షలు



బండి సంజయ్‌కు స్వీట్ తినిపిస్తున్న ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి నగరానికి బుధవారం వచ్చిన బండి సంజయ్‌కు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన బండి సంజయ్‌కు శాలువాకప్పి స్వీట్ తినిపించి అభినందించారు. కేంద్ర మంత్రిగా బండి సంజయ్ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

కాఫీ కథను తెలియజేసిన 'క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్'

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తోట నుంచి కప్పులోకి చేరే వరకు కాఫీకి ఉన్న ప్రయాణ కథను తెలియజేసేలా మాదాపూర్‌లోని ద కోరమ్‌లో బుధవారం క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్ పేరిట ఓ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాఫీ ప్రియులు, సాగుదారులు, కేఫ్ యజమానులు, స్పెషాలిటీ కాఫీ కమ్యూనిటీకి చెందిన నిపుణులందరినీ ఒకేచోటకు చేర్చి స్పెషాలిటీ కాఫీలను చర్చించింది. రత్నగిరి ఎస్టేట్ నుంచి తీసుకువచ్చిన స్పెషాలిటీ కాఫీలను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో రత్నగిరి ఇంటర్నేషనల్ మేనేజింగ్ పార్టనర్ అశోక్ పాత్రే మాట్లాడుతూ హై-గ్రేడ్ స్పెషాలిటీ ఇండియన్ కాఫీని పండించడంలోని సవాళ్లు, కాఫీ ప్రాముఖ్యతను వివరించారు. ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్ వ్యవస్థాపకురాలు చాందిని ఎస్ఆర్‌కె మాట్లాడుతూ కాఫీ రైతులు, వినియోగదారుల మధ్య అంతరాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని అన్నారు.

నల్సార్‌లో ఇద్దరు విశిష్ట ప్రొఫెసర్ల నియామకం

గోపాలకృష్ణగాంధీ, సాయినాథ్ ఎంపిక



ప్రొ.సాయినాథ్ ప్రొ.గోపాలకృష్ణగాంధీ

శామీర్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీ విశిష్ట ప్రొఫెసర్లుగా మాజీ గవర్నర్, దౌత్యవేత్త గోపాలకృష్ణగాంధీ, ప్రముఖ పాత్రికేయుడు, మెగసెసే అవార్డు గ్రహీత సాయినాథ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నల్సార్ వైస్ చాన్స్‌లర్, ప్రొ.కృష్ణదేవరావు మాట్లాడుతూ విశిష్ట ప్రొఫెసర్ అనే పదవికి ప్రజాక్షేత్రంలో అత్యంత గొప్పసేవ చేస్తున్న మేధావులను గుర్తించి, నల్సార్ విశ్వవిద్యాలయంలో విద్యాపరంగా వారి సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. న్యాయ విద్య పరిధిని విస్తృతం చేసి, లా విద్యార్థులకు, న్యాయ భావన జస్టిస్‌కు అనేక ప్రధాన ప్రశ్నలను పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ దిశగా ఈ మేధావులను విశిష్ట ప్రొఫెసర్లుగా నియమించి ఒక ముందడుగు వేసినట్లు వివరించారు. విద్యార్థులకు, చట్టానికి, సామాజిక ఆర్థిక న్యాయానికి మధ్య ఉండే సంబంధాన్ని మేధావులు వివరిస్తారని ఆయన తెలిపారు.

కులగణన చేసి రిజర్వేషన్లు పెంచాలి

● **బీసీ మేధోమదన సదస్సులో వక్తలు**



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

ఖైరతాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో బీసీ కులగణన చేసి రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన పెంచాలని, లేనట్లయితే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని బీసీ సంఘాలు హెచ్చరించాయి. ఎన్నికల కోడ్ ముగియగానే కులగణన చేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఆమేరకు పనులు ప్రారంభం చేయకపోవడంతో ప్రజలను చైతన్యపరచి ఉద్యమబాట పట్టనున్నట్లు తెలిపారు. బుధవారం లక్డీకాపూల్ హోటల్ అశోకాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ మేధావులతో మేధోమదన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా బీసీలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఆయన ఇచ్చిన మాటకు విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ మేధావులను చర్చలకు పిలిచి రిజర్వేషన్ల పెంపునకు మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు. లేనట్లయితే అన్ని జిల్లాల్లో జేఏసీలను ఏర్పాటు చేసి జూలై 1 నుంచి అన్ని జిల్లాలకు బీసీ మేధావులతో బస్సు యాత్ర చేపడుతామని తెలిపారు. అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు, బాసర నుంచి భాగ్యనగర్ వరకు భహిరంగ సభలు నిర్వహించి బీసీలను చైతన్యవంతులను చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ అనంతరం ప్రభుత్వం స్పందించకపోతే తెలంగాణ బంద్ నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు బీసీలకు జరుగుతున్న అన్యాయంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టేందుకు కేవలం 15 రోజులు సరిపోతుందని, తరువాత ఏ ఎన్నికలైనా జరపాలని అన్నారు.

సదస్సులో ప్రొఫెసర్లు సింహాద్రి, తిరుమల, బీసీ సంఘాల నేతలు వీజీఆర్ నారగోని, గణేష్ చారి, సురేష్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్‌గౌడ్, బీసీ మేధావులు సుంకర సత్యనారాయణ, ప్రొఫెసర్ వినయ్‌బిబు, ప్రొఫెసర్ వెంకట్రామయ్య, సమ్మయ్య, వేణుమాధవ్, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్

విద్య, వైద్య రంగం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● **బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్**

నల్లకుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యా, వైద్య రంగం అభివృద్ధి కోసం తగిన నిధులు కేటాయించి ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్ఎఫ్) చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు, కార్పొరేట్ వైద్య సంస్థల అధిక ఫీజుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. బుధవారం నల్లకుంటలోని బీఎల్ఎఫ్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేదలు నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో బహుజన కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కె. పర్వతాలు, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియలా రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగాచారి, బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, నాయకులు ఎస్. సిద్ధిరాములు, సావిత్రి, సునీల్‌కుమార్, ఎం. జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడ మసీదు గల్లీలో కలుషిత నీటి సమస్యను అడిగి తెలుసుకుంటున్న ముఠా జైసింహ, తదితరులు

కలుషిత నీటి సరఫరాను అరికట్టేందుకు చర్యలు

కవాడిగూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని మసీదు గల్లీలో కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ అన్నారు. కవాడిగూడ డివిజన్‌లోని మసీద్ గల్లీలో కొంత కాలంగా కలుషిత నీరు సరఫరా అవుతుందని ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో ముఠా జైసింహ వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి బుధవారం బస్తీలో పర్యటించారు. స్థానికులు కలుషిత నీటి సమస్యతో తాము పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కరించేందుకు నూతన పైప్‌లైన్లు వేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేసి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డి సాయికృష్ణ, బీఆర్‌ఎస్ నేతలు విక్కీ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

130 సెల్‌ఫోన్లు రికవరీ చేశాం: ఇన్‌స్పెక్టర్



మూర్తికి మొబైల్ అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య


చిక్కడపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బాధితులు పోగొట్టుకున్న 130 సెల్‌ఫోన్లు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి వారికి అందజేశామని స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య వివరించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లను జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన సూచించారు. ఎం.ఎల్.ఎన్. మూర్తి అనే 60 సంవత్సరాల వ్యక్తి పోగొట్టుకున్న విలువైన సామ్‌సంగ్ మొబైల్‌ఫోన్‌ను రికవరీ చేసి బుధవారం స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఆయనకు మొబైల్ అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు తన ఫోన్‌ను తనకు ఇప్పించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సినిమా థియేటర్‌లు ఇతర రద్దీ ప్రాంతాల్లో నుంచి వెళ్లే సమయంలో ప్రజలు తమ మొబైల్‌లను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.



గోల్నాక డివిజన్‌లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్, తదితరులు

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

గోల్నాక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేవైఎం గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సింగీతం రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్‌లోని గంగానగర్ బ్రిడ్జి వద్ద గల స్వామి వివేకానంద విగ్రహం వద్ద హిందూ సామ్రాజ్య దినోత్సవంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం రోజును హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ మోత్కుల శ్యామ్‌రాజ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేసరి నర్సింగ్‌రావు యాదవ్, పార్టీ నాయకులు కె.రాంచందర్, ఎస్.శ్రీధర్‌గౌడ్, బి.ఈశ్వర్‌రావు, గాజుల గోపాల్, చందు, శ్రీకాంత్, విష్ణువర్ధన్, యు.శ్రీనివాస్, కేశవ్, సంతోష్‌వర్మ, రాకేష్, మహావీర్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



పఠాన్‌బస్తీలో కేక్‌ను కట్ చేస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ మినాజ్

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని ప్రజలు రాహుల్ గాంధీకి అండగా నిలిచారని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. పలుచోట్ల చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు.

-ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం, ఆంధ్రజ్యోతి



కేక్ కట్ చేస్తున్న రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ మంచ్ రాష్ట్ర నాయకులు గుర్రం శంకర్